# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-06-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల నియమావళిని నిలుపుదల చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా వెల్లడించారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 11వ తేదీన తెలుగుదేశం శాసనసభా పక్ష నాయకులుగా నారా చంద్రబాబు నాయుడును ఎన్నుకోనున్నామని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి**

**3.** **సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమం ఈరోజు నుంచి పునః ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది.**

**4.** **తెలంగాణలోని వరంగల్-ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.**

**5.** **ఈరోజు ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును నిలుపుదల చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో వెలువడిన ఫలితాలను బట్టి రాష్ట్రంలో 25 ఎంపీ స్థానాలకు, 175 ఎమ్మెల్యే స్థానాలకు నూతనంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఖరారు చేయడంతో రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును నిలుపుదల చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల కోడ్‌ను 12 జిల్లాల్లో మినహా మిగిలిన 21 జిల్లాల్లో ఎత్తివేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

కాగా తెలంగాణలో శాసనమండలిలోని వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం ఓట్ల లెక్కింపు జరుగుతున్న క్రమంలో సిద్దిపేట, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి, జనగామ, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి, ఖమ్మం, ములుగు జిల్లాల్లో ఎన్నికల నియమావళి కొనసాగుతుందని తెలిపింది.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల ఎన్నికైన శాసన సభ్యుల జాబితాను గవర్నర్‌కు అందజేశారు. ఈ జాబితాలో రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన 175 నియోజకవర్గాలకు చెందిన శాసనసభ్యుల పేర్లు, వారి పార్టీల

వివరాలు పొందుపరిచారు. ఈ సమావేశంలో ఎన్నికల సంఘం అదనపు ముఖ్య కార్యదర్శులు పి. కోటేశ్వరరావు, ఎమ్.ఎన్. హరెంధిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఈనెల 11వ తేదీన తెలుగుదేశం శాసనసభా పక్ష నాయకులుగా నారా చంద్రబాబు నాయుడును ఎన్నుకుని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు నివేదిక పంపుతామని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం ఈ నెల 12వ తేదిన ఉంటుందని వెల్లడించారు. ప్రమాణ స్వీకారానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా వివిధ పార్టీల నేతల్ని ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమాలకు చంద్రబాబు నాయుడు వెళ్తారని బుచ్చయ్యచౌదరి తెలిపారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమం ఈ రోజు నుంచి పునః ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికల నియమావళి ముగిసిన నేపథ్యంలో ఈ రోజు నుంచి ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని ప్రజాభవన్‌లో ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుందని పేర్కొంది. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వాటిని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

---------------------------

తెలంగాణలోని వరంగల్-ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ముగిసేసరికి అధికార కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, తన సమీప ప్రత్యర్థి.. ఏనుగుల రాకేశ్‌రెడ్డిపై 18 వేల 565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. మొదటి ప్రాధాన్య ఓట్లు లెక్కించిన నాలుగు రౌండ్లలో కలిపి తీన్మార్ మల్లన్నకు లక్షా 22 వేల 813 ఓట్లు రాగా.. రాకేశ్‌రెడ్డికి లక్షా 4 వేల 248 ఓట్లు వచ్చాయి. బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి 43 వేల 313 ఓట్లతో మూడో స్థానంలో, మరో అభ్యర్థి పాలకూరి అశోక్‌గౌడ్ 29 వేల 697 ఓట్లతో నాలుగో స్థానంలో ఉన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు గత రాత్రి పూర్తి కాగా.. రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. ఈ ఓట్ల లెక్కింపు ఈ రోజు కూడా కొనసాగనుంది.

---------------------------

ఆహార భద్రతలో ఊహించని వాటికి సిద్ధంగా ఉండటం అన్న ఇతివృత్తంతో ఈరోజు ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు 2018 సంవత్సరం నుండి ప్రతి ఏటా జూన్ 7వ తేదీన ఆహార భద్రతా దినోత్సవం జరుగుతోంది. పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహారం తీసుకోవలసిన ఆవశ్యకత పట్ల ఈరోజు అవగాహన కల్పిస్తున్నారు. సమతుల్య ఆహారం తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించడం, కలుషిత ఆహారం వల్ల జరిగే అనర్థాలను వివరించడమే లక్ష్యంగా ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

కాగా ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ఈ రోజు ఉదయం 10 గంటలకు ఆహార భద్రత – నాణ్యత అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని ప్రసారం చేస్తుంది.

---------------------------

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ –టీజీపీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఈ నెల 9న నిర్వహించే ఈ పరీక్షల ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలతో దృశ్య మాధ్యమం ద్వారా ఆమె నిన్న సమీక్షించారు. తెలంగాణలో గ్రూప్ –1 ప్రిలిమినరీ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లాల వ్యాప్తంగా పోలీసు, ఇతర అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆమె ఆదేశించారు.

అలాగే తెలంగాణలో విత్తనాలు, ఎరువుల సరఫరా, మిషన్ భగీరథ, గ్రామాల్లో ఇంటింటి సర్వే, జిల్లాల్లో పాఠశాలలకు ఏకరూప దుస్తుల పంపిణీ వంటి అంశాలపై కూడాసమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణలో సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, శుద్ధి చేసిన విత్తనాలను కొనుగోలు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఉందా లేదా అనే విషయాన్ని నిర్ణీత గడువులోగా సర్వే చేయాలని తెలిపారు. జూన్ 12వ తేదీన పాఠశాలలు ప్రారంభించే నాటికి ఒక జత పాఠశాల ఏకరూప దుస్తుల విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

--------------------------

తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా నిన్నటి నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభమైందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. బడిబాటలో భాగంగా.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే వచ్చే విద్యా, అవకాశాలపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించనున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా జూన్ 12వ తేదీన తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పాఠశాలలను పున:ప్రారంభించనున్నారని చెప్పారు. పాఠశాలల పున:ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించనున్నామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

--------------------------

నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్న ఉపరితల ఆవర్తనం దక్షిణ ఆంధ్రప్రదేశ్ పరిసర ప్రాంతాలలో సముద్రమట్టానికి 3.1 నుంచి 4.5 కిలో మీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉందని, దీని ప్రభావంతో మరిన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని..ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో రానున్న 5 రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపిందికొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

అలాగే తెలంగాణలో రాగల మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈరోజు కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలతో పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. రేపు కూడా ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణకేంద్రం అధికారులు తెలిపారు.కాగా నిన్న సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది.

--------------------------

తెలంగాణ హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో రేపు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు బత్తిన సోదరులు తెలిపారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా చేప ప్రసాదాన్ని పంపిణీకి సిద్దం చేశామని చెప్పారు. ఈ మందు వల్ల ఉబ్బస వ్యాధి తగ్గుతుందన్న నమ్మకంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు చేపప్రసాదాన్ని స్వీకరించడానికి వస్తుంటారు. ఈ పంపిణీకి రహదారులు, భవనాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుకు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని, విభజన చట్టానికి సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అంశాలను సుహృద్భావ వాతావరణంలో పరిష్కరించుకునేందుకు సహకరించాలని కోరారు.

======================